


రివ్యూలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# వేడుకలు సజావుగా సాగాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్, సెప్టెంబర్ 15: మానకొండూర్ పెద్దచెరువులో సోమవారం నిర్వహించే గణేశుడి నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నిమజ్జనం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆదివారం మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. చెరువుకట్ట వద్ద చేసిన ఏర్పాట్లను సంబందిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా గణేశుడి నిమజ్జన వేడుకులు ప్రశాంతంగా జరుగాలని, దీనికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని అదేశించారు.

కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ వద్ద తొలి వినాయకుడి ఊరేగింపు 6 గంటలకు ప్రారంభమవుతుందని, సకాలంలో ఊరేగింపు ప్రారంభించాలని నిర్వాహుకులను కోరారు. కరీంనగర్-వరంగల్ రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని, భక్తులకు, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులంతా అందుబాటులో ఉండాలని, అవసరమైతే షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ సమేలా సత్పతి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీఎం అండ్‌హెచ్‌వో సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇందుర్తిలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

# అమరుల ఆశయ సాధనకు సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, సెప్టెంబర్ 15: ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాల్లో అమరవీరులైన వారి త్యాగాలు వృథా కావని, వారి ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నేటి తరం కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చిగురుమామిడి మండలం ఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లె, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాలకు చెందిన అమరవీరుల స్మారక స్థూపాల వద్ద ఆదివారం సీపీఐ నేతలతో కలిసి చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు. ఆయా చోట్ల సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు నేటికీ ప్రజా సమస్యలపై సీపీఐ నిత్యం పోరాడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి వేళాయె

- నేడు, రేపు వేడుకలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేశాం: కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల అర్బన్: చింతకుంట చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల అర్బన్/జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 15: తొమ్మిది రోజులు విశేష పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనానికి వేళయింది. జిల్లాలో సోమవారం, జిల్లా కేంద్రంలో సోమ, మంగళవారం రెండ్రోజులపాటు వేడుకలు జరుగనుండగా, యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బందోబస్తుతోపాటు పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నది.

## పకడ్బందీ ఏర్పాట్లు చేశాం: కలెక్టర్

వినాయక నిమజ్జనానికి జిల్లా కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం చింత కుంట చెరువు వద్ద ఏర్పాట్లను ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనం, శోభాయాత్ర జరిగే రూట్‌ను పరిశీలించి అధికారులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనానికి జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జగిత్యాల పట్టణంలో వినాయక శోభాయాత్ర జరిగే రూట్లలో విద్యుత్ లైన్ల ఎత్తు పెంచామని, చింత కుంట చెరువు వద్ద 52 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆరు క్రేన్లు, 250 మంది సిబ్బందిని, లైటింగ్, తదితర అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా జిల్లాలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో 500 మంది, జిల్లాలో 3వేల మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. రాకపోకలకు అంతరాయం కలుగకుండా పలుచోట్ల ట్రాఫిక్‌ను డైవర్ట్ చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, ఆర్డీవో మధుసుదన్, మున్సిపల్ చైర్మన్ సమ్మయ్య, డీఎస్పీ రఘుచందర్, సీఐ పాల్గొన్నారు.

## వాహనాల దారి మళ్లింపు

జిల్లా కేంద్రంలో సోమవారం ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. కరీంనగర్ నుంచి ధర్మపురి, మంచిర్యాలకు వెళ్లే వాహనాలు ఎస్సారెస్పీ కెనాల్ ధరూర్ వద్ద బైపాస్ నుంచి లక్ష్మీపూర్ మీదుగా వెళ్లాలని సూచించారు. కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలు ధరూర్ కెనాల్ వద్ద నుంచి బైపాస్ మీదుగా వెళ్లాలని, అలాగే కోరుట్ల, మెట్‌పెల్లి, నిజామాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు చల్‌గల్ బైపాస్ నుంచి ధరూర్ మీదుగా పయనించాలని సూచించారు. అలాగే ధర్మపురి, మంచిర్యాల నుంచి జగిత్యాలకు వచ్చే వాహనాలు రాజీవ్ చౌక్ బైపాస్, గొల్లపెల్లి చౌరస్తా నుంచి బైపాస్ మీదుగా, ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల నుంచి జగిత్యాలకు వచ్చే వాహనదారులు పాత బస్టాండ్, గొల్లపెల్లి చౌరస్తా మీదుగా బైపాల్ రోడ్డు నుంచి వెళ్లాలని వివరించారు.

# నృసింహుడి క్షేత్రంలో అడిషనల్ కలెక్టర్

ధర్మపురి, సెప్టెంబర్ 15: ధర్మపురి నృసింహుడిని ఆదివారం అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు, అర్చకులు ఆయనతో స్వామివారికి పూజలు చేయించారు. తర్వాత దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ శేష వస్త్రం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు నంభి నరసింహ మూర్తి, చక్రపాణి కిరణ్ పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న సిబ్బంది

# ఎస్‌ఐని దించి వస్తానని..

బైక్‌తో ఉడాయించిన వ్యక్తి

కరీంనగర్‌లోని శాస్త్రీరోడ్‌లో ఘటన

కరీంనగర్ రాంనగర్, సెప్టెంబర్ 15 : కానిస్టేబుల్ తరహా దుస్తులు దరించిన ఓ వ్యక్తి రోడ్డుపై విధులు నిర్వర్తిస్తున్నట్టు నటించి.. అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడిని ఆపి ఎస్‌ఐని దించి వస్తానని బైక్‌తో సహా ఉడాయించాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాస్త్రీరోడ్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఫతేపురకు చెందిన బొజ్జ శివమ్ తన బుల్లెట్ వాహనంపై శాస్త్రీరోడ్డుపై వస్తుండగా అక్కడే కానిస్టేబుల్ తరహా దుస్తుల్లో విధి నిర్వహణలో ఉన్నట్టుగా నటించిన వ్యక్తి వాహనాన్ని ఆపాడు. సమీపంలో తమ ట్రాఫిక్ ఎస్‌ఐ విధులు నిర్వర్తిస్తున్నాడని, అతడిని దించి వస్తానని, బైక్ ఇవ్వాలని అడిగాడు. పోలీస్ యూనిఫాంలో ఉండడంతో ఆ వ్యక్తిని నమ్మిన శివమ్ తన బుల్లెట్ వాహనాన్ని ఇచ్చాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి హుటాహుటిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు చెప్పాడు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు తమ కానిస్టేబుల్ ఎవరూ అక్కడ విధినిర్వహణలో లేరని చెప్పడంతో వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ యూనిఫాంలో వచ్చిన వ్యక్తి తన బైక్ ఎత్తుకెళ్లాడని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సరిలాల్ తెలిపారు.



కళా ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

# 'నవోదయ'లో కళా ఉత్సవాలు ప్రారంభం

చొప్పదండి, సెప్టెంబర్ 15: నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళా ఉత్సవాలను ఎస్‌యూ రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి, విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు ఆదివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో తెలంగాణలోని తొమ్మిది నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాలకు చెందిన నవోదయ విద్యాలయాల విద్యార్థులు పాటలు, నృత్యాలు, చిత్రలేఖన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రొఫెసర్ శర్మ, బాలభవన్ సూపరింటెండెంట్ కట్టు మంజుల, థియేటర్ ఆర్టిస్టులు సత్యనారాయణ, సంగం రాధాకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకులం ఎదుట ఆందోళన

గన్నేరువరం, సెప్టెంబర్15 : విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు వస్తున్నాయని గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద గల మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. 400 మంది బాలికలు ఉన్న పాఠశాలలో సమస్యలు పట్టించుకోకుండా అధికారులు ఏం చేస్తున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చుక్కల్ల శ్రీశైలం ప్రశ్నించారు. ఇప్పటికే డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని, పురుగుల అన్నం తింటే తమ పిల్లల భవితవ్యం ఏంటని వారి తల్లిదండ్రులు మండిపడ్డారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. సమస్యలు చూసేందుకు పాఠశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే సిబ్బంది రానివ్వడం లేదని అన్నారు. రెండు నెలల కిందట ఎమ్మెల్యే ఈ పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో డ్రైనేజీ వ్యవస్థ, సమస్యలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని, అయినా పరిస్థితుల్లో మార్పులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నవీనను సంప్రదించగా, ప్రతి రోజూ కూరగాయలు, బియ్యం శుభ్రం చేసిన తర్వాతే వంటలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, పొరపాటున అన్నంలో పురుగు వచ్చి ఉంటుందని పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 15: తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సాట్స్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2024పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా నుండి 27 మంది బాలికలు, 9మంది బాలురు ఈ పోటీలకు హాజరైనట్లు పేర్కొన్నా రు. అదేవిధంగా సీనియర్‌స విభాగంలో కుసుమ కుమారి, సందీప్, లా వణ్య, సరళదేవి, యోగా కోచ్ బుర్ర అశోక్ పాల్గొన్నట్లు తెలిపారు.